## మాజీ మంత్రి హరీశ్‌రావు వాహనం తనిఖీ



మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 14: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం నారాయణఖేడ్ పట్టణ సమీపంలోని వెంకటాపూర్ చౌరస్తా వద్ద మాజీ మంత్రి హరీశ్‌రావు వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. నారాయణఖేడ్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశంలో పాల్గొని నర్సాపూర్ వెళ్తున్న క్రమంలో స్థానిక ఎస్‌ఐ విద్యాచరణ్ రెడ్డి నేతృత్వంలోని ప్రత్యేక బలగాలు వాహన తనిఖీలు చేస్తుండగా మాజీ మంత్రి తన వాహనాన్ని నిలిపి పోలీసులకు సహకరించారు. పోలీసుల తనిఖీలు పూర్తైన అనంతరం హరీశ్‌రావు బయలుదేరి వెళ్లారు.

### పార్టీలో కష్టపడ్డ వారికి గుర్తింపు

అందోల్, ఏప్రిల్ 14: బీఆర్‌ఎస్‌లో కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. జోగిపేటలో పార్టీ సీనియర్ నాయకుడు వీరభద్రరావుతో మాట్లాడిన హరీశ్‌రావు పార్టీలో ముందుందు తగిన ప్రాధాన్యం ఇస్తామని, కీలక బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు. వీరభద్రరావు కొద్ది రోజులుగా పార్టీని విడుతునట్టు ప్రచారం రావడంతో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌తో కలిసి వీరభద్రరావు ఇంటికి వెళ్లిన హరీశ్‌రావు ఆయనతో మాట్లాడి భుజ్జగించారు. వీరభద్రరావు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌లోనే ఉంటానని ఎంపీ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తానని హామీనిచ్చారు.

## అంబలి కేంద్రం ప్రారంభం



దివ్యాంగుడికి అంబలి తాగిపిస్తున్న న్యాయవాది ప్రభు

వట్‌పల్లి, ఏప్రిల్ 14: మండల కేంద్రంలోని పోతులబోగుడ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది చంటి ప్రభు తల్లిదండుల జ్ఞాపకార్థం అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రయణికుల దాహం తీర్చేందుకు అంబలి కేంద్రం ప్రారంభించినట్లు ఆయన తెలియజేశారు. అనంతరం అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పులమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అపర్ణ, విఠల్, మండల నాయకులు పాల్గొన్నారు.

## రైతుల గోడు పట్టించుకోని ప్రభుత్వం

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 14: రైతుల గోడును కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గడీల బైరవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం సిద్దిపేటలో ఆయన ఆదివారం మాట్లాడుతూ.. ఇప్పటికే వరి కోతలు ప్రారంభమయ్యాయని, కొన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం రాజకీయాలు మాని యాసంగి వడ్లను రూ.2,203 తో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



పటాన్‌చెరు: అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



జహీరాబాద్ పట్టణంలో నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు



న్యాల్‌కల్: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ బీబీ పాటిల్

# అంబేద్కర్‌కు ఘన నివాళి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని జిల్లాలోని పట్టణాలు, పల్లెల్లో ఘనంగా నిర్వాహించారు. అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. పటాన్‌చెరులో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, జహీరాబాద్‌లో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, న్యాల్‌కల్‌లో ఎంపీ బీబీ పాటిల్, కంది చౌరస్తాలో మంత్రి కొండ సురేఖ, జిల్లా కేంద్రం సంగారెడ్డిలో కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ రూపేశ్, ఆయా గ్రామాలు పట్టణాల్లో ప్రజాప్రతినిధులు, పలు సంఘాల నేతలు అంబేద్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేసిన అపరమేదావి అని, ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

*– నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 14*



సంగారెడ్డి కలెక్టరేట్: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి



నారాయణఖేడ్: పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



కంది: అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న మంత్రి కొండా సురేఖ



అమీన్‌పూర్: అంబేద్కర్ జయంతి వేడుకలు



రాయికోడ్: నివాళి అనంతరం మాట్లాడుతున్న వివిధ పార్టీల నాయకులు



కల్హేర్: కృష్ణాపూర్‌లో..



రామచంద్రాపురం: భారతీనగర్‌లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి



మునిపల్లి: బుధేరాలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న యువకులు



రామచంద్రాపురం: నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్



అమీన్‌పూర్: పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి




పుల్కల్: నినాదాలు చేస్తున్న నాయకులు, యువకులు




జిన్నారం: నివాళులర్పిస్తున్న వివిధ పార్టీ నాయకులు



బొల్లారం: పూలమాల వేస్తున్న మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి



అందోల్ : జోగిపేటలో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



గుమ్మడిదల: రక్తదానం చేస్తున్న నాయకులు నరేందర్ రెడ్డి, తదితరులు

## సాబెర్ దర్గాలో మాజీ మంత్రి ప్రత్యేక ప్రార్థనలు

కొండాపూర్, ఏప్రిల్ 14: మండల పరిధిలోని మల్కాపూర్ సాబెర్ ప్రియా దర్గా ఉత్సవాల్లో ఆదివారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పార్థనలు చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మె ల్యే చింతా ప్రభాకర్, మల్కాపూర్ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

## 15 మంది వడ్డీ వ్యాపారులపై కేసు నమోదు

చేర్యాల/కొమురవెల్లి, ఏప్రిల్ 14: చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో అధిక వడ్డీకి అప్పులిస్తున్నారనే సమాచారంతో 28 మందికి సంబంధించిన ఇండ్లు, దుకాణాల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. రెండు మండలాల్లో రూ.15,33,700 నగదుతోపాటు బంగారు, వెండి ఆభరణలు, పట్టాదారు పాస్ బుక్కులు, అప్పు పత్రాలు, రిజిస్టర్ డాక్యుమెంట్లు స్వాదీనం చేసుకొని 15 మందిపై కేసు నమోదు చేసినట్లు చేర్యాల సీఐ శ్రీను ఆదివారం వివరాలు వెల్లడించారు. చేర్యాల పట్టణానికి చెందిన తేరాల శంకర్ వద్ద రూ.1,25000నగదు, బంగారు, వెండి ఆభరణాలు పట్టా పాస్ బుక్కులు, బచ్చు మురళి వద్ద రూ.3.50 లక్షలు, రిజిస్టర్ సెల్‌డీడ్ డాక్యుమెంట్ పత్రాలు, సోలంకి దుర్గారం వద్ద రూ.63వేల నగదు, ప్రామిసరీ నోట్లు, పులిగిల్ల సుధాకర్ వద్ద విలువైన పత్రాలు, పట్టాదారు పాస్‌బుక్కులు, చిట్యాలకు చెందిన ఏలె అంజయ్య వద్ద రూ.1,24300నగదు, అప్పు పత్రాలు, రిజిస్టర్ డాక్యుమెంట్లు, కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కొమురవెల్లికి చెందిన రేణికుంట మహేందర్, గుండా సత్యనారాయణ, లింగంపల్లి కనకరాజు, గౌరాయపల్లికి చెందిన బొచ్చు దశరథం, పోసాన్‌పల్లికి చెందిన కానుగంటి చంద్రారెడ్డి, నిమ్మ మల్లారెడ్డి, కిష్టంపేటకు చెందిన ఆకుల సత్తయ్య, పంజాల నర్సింహులు, పెద్దరాజుపేటకు చెందిన బొంగురం ఆగంరెడ్డి, బొజ్జ యాదగిరి వద్ద అప్పు పత్రాలు, డాక్యుమెంట్లు స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించా రు. ఆయన వెంట చేర్యాల, కొమురవెల్లి ఎస్సైలు దామోదర్, నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

- ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తాం
- ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ
- సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్‌లో కార్యకర్తల సమావేశం

## నీలం మధును గెలిపించాలి




సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

కొండాపూర్, ఏప్రిల్14: మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌ను లక్ష మెజార్టీతో గెలిపించాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సంగారెడ్డి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరె గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. ఇంతకు ముందు మెదక్ ఎంపీగా కాంగ్రెస్ నుంచి ఎన్నికైన ఇందిరాగాంధీ దేశప్రధానమంత్రిగా పని చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు నీలం మధు ముదిరాజ్‌ను గెలిపించి సోనియాగాంధీకి కానుకగా ఇవ్వాలన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి కావాలంటే మెదక్ ఎంపీగా నీలం మధును గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో టీఎస్ఐఐసీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నిర్మల, కొండాపూర్ మండలాధ్యక్షుడు ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, సొసైటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, సంగారెడ్డి, కొండాపూర్, సదాశివపేట మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

# గ్యాస్ ఏజెన్సీల నిలువు దోపిడీ!

- ఒక్కో సిలిండర్‌పై అదనంగా రూ.50 వసూలు
- సబ్సిడీ పడడం లేదంటు వినియోగదారుల ఆగ్రహం




పుల్కల్, ఏప్రిల్ 14: గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. మండల కేంద్రం పుల్కల్ భారత్ గ్యాస్ ఏజెన్సీకి ఎప్పుడు వెళ్లినా గ్యాస్ అందుబాటులో ఉండడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. కేవైసీ పేరుతో ఆన్‌లైన్ చేస్తామని చెబుతూ డబ్బులు వసూలు చేస్తున్నారని మండిపడుతున్నారు. గ్యాస్ బుక్ చేసుకున్న వ్యక్తి ఇంటికీ గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాలని ఉన్నప్పటికీ ఒకే చోటుకు గ్యాస్ వెహికిల్ వస్తున్నది. అక్కడి నుంచే వినియోగదారులు సిలిండర్ మోసుకెళ్లాల్సి వస్తున్నదని వాపోతున్నారు. ఇదేమని అడిగితే మీ గ్రామానికి గ్యాస్ బండి రాదంటూ ఖరాకండిగా చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో సిలిండర్‌పై రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. సబ్సిడీ కూడా సక్రమంగా పడడం లేదని, గ్యాస్ ఏజన్సీకి వెళ్తే సరైన సమాధానం ఇవ్వడం లేదంటూ పలు గ్రామాలకు చెందిన వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. జోగిపేట పట్టణం నుంచి గ్యాస్ తీసుకువస్తున్నాం కాబట్టి రూ.50 అదనంగా ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారని చెబుతున్నారు. రూ.500 వందలకే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1,000 సిలిండర్‌కు చెల్లిస్తున్నామంటూ వినియోగదారులు వాపోతున్నారు. సబ్సిడీ కింద మిగతా రూ.500 బ్యాంక్ అకౌంట్‌లో జమ అవుతాయని చెబుతున్నప్పటికీ సబ్సిడీ పడటం లేదంటూ వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు గ్యాస్ నిర్వాహకులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలంటూ వినియోగదారులు కోరుతున్నారు.

### రూ.50 ఎక్కువ తీసుకుంటుండ్రు



గ్యాస్ సిలిండర్ తీసుకున్నప్పుడు మా నుంచి రూ.50 ఇవ్వాలంటూ ఆటో డ్రైవర్ డిమాండ్ చేస్తున్నడు. లేదంటే మీకు గ్యాస్ ఇవ్వడం కుదరదు అంటూ చెబుతున్నడు. డబ్బులు ఇచ్చిన వారికే గ్యాస్ సిలిండర్ ఇచ్చి వెళ్తున్నారు.

*- మున్నూరు రుక్కమ్మ, పోచారం*

### సబ్సిడీ జమ కావడం లేదు



గ్యాస్ సబ్సిడీ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ కావడం లేదు. డబ్బులు పడటం లేదని కార్యాలయానికి వెళ్తే అది మా చేతుల్లో లేదు అని సమాధానం చెబుతున్నరు. ప్రభుత్వం ఎప్పుడు డబ్బులు వేస్తే అప్పుడే తీసుకోండి అంటున్నరు.

*- ఈడ్గి లోకేశ్, పుల్కల్*


### సమస్య మా దృష్టికి రాలేదు

ఒక్కో గ్యాస్ సిలిండర్‌పై రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారనే విషయం మా దృష్టికి రాలేదు. ఒక వేళ డ్రైవర్లు ఏమైనా తీసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటాం. గ్యాస్ సబ్సిడీ గురించి మాకు సంబంధం లేదు. సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం ఎప్పుడు వేస్తుందో మాకు తెలియదు. వేసినప్పుడు వినియోగదారుల అకౌంట్‌లో జమ అవుతాయి.

*- ప్రమోద్, భారత్ గ్యాస్ నిర్వాహకుడు*

## బీరప్ప ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

కోహీర్, ఏప్రిల్ 14: మన్నాపూర్ బీరప్ప ఆలయ ఉత్సవాలకు ఆదివారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. వేడుకల్లో భాగంగా కళాకారులు ఒగ్గుకథను వినిపించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నామ రవికరణ్‌గుప్తా, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బీరప్ప జాతరకు హాజరైన ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు


## గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాలపై దాడులు



రాయపోల్, ఏప్రిల్ 14: రాయపోల్ మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ కంపెనీ గోదాం లో నిబంధనకు విరుద్ధంగా సబ్సిడీ సిలిండర్‌ల నుంచి రీఫిల్లింగ్ చేస్తూ హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు గ్యాస్ గోదాంపై దాడి చేశారు. సిలిండర్లను, ఆటోను స్వాధీనం చేసుకుకొని, పూర్తి సమాచారం సేకరిస్తున్నామని రాయపోల్ ఎస్సై విక్కుర్తి రఘుపతి తెలిపారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

కల్హేర్, ఏప్రిల్ 14: మండల పరిధిలోని ఇందిరానగర్ తండాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు లక్ష్మణ్‌నాయక్ మాతృమూర్తి మృతి చెందడంతో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, నాయకులు జనార్దన్‌సార్ ఉన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి